# పరీక్ష జ్వరం



నవీన్

కాస్త వాకింగ్ చేసినట్టుగానూ వుంటుంది ...... చాలా రోజులుగా కలుసుకోవాలనుకుంటున్న మిత్రుడు డాక్టర్ రాజశేఖర్‌ను కలిసినట్టుగానూ వుంటుందని ఉదయం ఆరుగంటలకే తయారయి నడవటం మొదలెట్టాను.


నేను వెళ్ళేటప్పటికి రాజశేఖర్ యింట్లోనే వున్నాడు. నన్ను చూడగానే చాలా ఆప్యాయంగా ఆహ్వానించాడు.

"చాలా రోజులయింది నిన్ను చూసి...... ఎలా వుంది జీవితం?" అన్నాను.

"చాలా దుర్భరంగా వుందిరా!" అన్నాడు బాధగా మొహం పెట్టి.

"నీకే జీవితం దుర్భరంగా వుంటే ఇంకెవడికి బావుంటుంది? ఊర్లోకెల్లా పేరుమోసిన గుండెల స్పెషలిస్టువి.... రెండు చేతులా ఆర్జిస్తున్నావు. పిల్లలందరూ బాగా చదువుకున్నారు... రేపు నీలాగే వాళ్ళు కూడా డాక్టర్లు కాబోతున్నారు...." అన్నాను.

"ఎగ్జాట్లీ! అక్కడే వుంది ప్రాబ్లెమ్ అంతా నీలాగే అందరూ మా పిల్లలందరూ డాక్టర్లవుతారని అనుకోవటం... ఆ పిల్లలకు యిష్టమున్నా లేకపోయినా బలవంతంగా వాళ్ళచేత రేపు డాక్టర్లు కావటానికి తోడ్పడే చదువులే చదివించటం. పిల్లల మీద కూడా మానసికంగా బోల్డు ప్రెషర్.... ఎల్లుండి నుండి మా చిన్నదానికి పరీక్షలు. పరీక్షలింకా వారం రోజులుండగానే దాన్లో టెన్షన్ స్టార్టవుతుంది. రోజు రోజుకు ఆ టెన్షన్ పెరిగిపోతుంది...... నిన్నట్నించి దానికి జ్వరం ఈ సంవత్సరమంతా విపరీతంగా చదివింది. ప్రతిరోజు ఐదింటికే లేచ ఎనిమిదింటి వరకు రెండు ట్యూషన్లు పూర్తి చేసుకునేది. తర్వాత కాలేజికి. కాలేజినుంచి ఇంటికొచ్చి హోమ్ వర్క్.... సాయంత్రం మరో రెండు ట్యూషన్లు దానికి సంవత్సరమంతా యిలాగే గడిచిపోయింది. అక్కయ్యలాగే తనూ డాక్టరవ్వాలని మొండిపట్టదలతో చదివింది. ఇంతా చదివి రేపు ఎగ్జామ్ రాస్తానో లేదో అనే భయంతో వణికిపోతోంది. దానికి మొదలే ఎగ్జామినేషన్ ఫోబియం.... దాంతో జ్వరం..... నిన్నట్నించి యేమీ తినటంలేదు. "నేను చదివిందంతా మరచిపోయాను. ఒక్కటి కూడా ఇప్పుడు గుర్తుకు రావటంలేదు. రేపు పరీక్షలో నేను ఒక్క అక్షరం కూడా రాయలేను." అంటూ పలవరిస్తోంది. దీని పరిస్థితి ఇలా వుందంటే మా అబ్బాయి సంగతి. వాడు స్టడీస్‌లో బాగానే వుండేవాడు. బి.ఇ ఫస్ట్‌క్లాసులో ప్యాసయ్యాడు. అప్పట్లో యేదన్నా జాబ్ దొరికేది. కానీ వాడికి ఐ.ఏ.ఎస్ పిచ్చి పట్టుకుంది. మద్రాసుకెళ్ళి కోచింగ్ తీసుకుంటానంటె పంపించాం. బోల్డు డబ్బు ఖర్చు పెట్టాడు. ఎన్నో పుస్తకాలు తెప్పించుకున్నాడు. రాత్రింబవళ్ళు చదివాడు. ప్రిలిమినరీస్ ప్యాసయ్యాడు గానీ మెయిన్ పోయింది. రెండోసారి మళ్ళీ అంత ప్రయత్నం చేశాడు - రెండోసారి కూడా పోయింది. ఇప్పుడు మూడో ప్రయత్నం మొదలెట్టాడు. ఐ.ఏ.ఎస్‌ను వదిలేసి యేదన్నా జాబ్ చూసుకోరా అంటే వినడు. ఎప్పుడూ అదే లోకం - వాడి క్లోజ్ ఫ్రెండెవరికో ఐ.ఏ.ఎస్ రాసిన మొదటిసారే అదృష్టం కలిసోచ్చి సెలక్ట్ అయ్యాడట. వాడికి తనకంటె ఎప్పుడూ తక్కువ మార్కులే వస్తుండేవట..... వాడు ఐ.ఏ.ఎస్ కాగా తనెందుకు కాకూడదు అనే పిచ్చి పట్టుదలతో వీడు బోల్డు డబ్బు పాడు చేస్తున్నాడు.... ఎంతో విలువయిన జీవితాన్ని కూడా పాడు చేసుకుంటున్నాడు...."





"పాడు చేసుకుంటున్నాడని ఎందుకనుకుంటున్నావు? రేపు వాడు ఐ.ఏ.ఎస్ ఆఫీసరయితే నువ్వే గర్వంగా మావాడు కలెక్టరయ్యాడని చెప్పుకుంటావు" అన్నాను.

"లేదు....వాడు ఐ.ఏ.ఎస్ ను సాధించలేడు. నాకు తెలుసు. వాడికా టాలెంట్ లేదు.... వాడు ఇంజినీర్‌గానే రాణిస్తాడు. కానీ వాడికా విషయం తెలీటంలేదు. ఇంత ప్రయత్నం చేసీ అనుకున్నది సాధించలేకపోయామనే ఫ్రస్ట్రేషన్ వీళ్ళను జీవితాంతం వెంటాడుతుంది. వీళ్ళను బాగుచెయ్యటం ఎలా అన్నది ప్రస్తుతం నేను ఎదుర్కొంటున్న సమస్య." అన్నాడు రాజశేఖర్.

"ఇది నీ ఒక్కడి సమస్యేకాదు. చాలా మంది పేరెంట్స్ సమస్య. పూర్వం కంటె ఇప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల విషయంలో మరీ ఎక్కువ శ్రద్ధ తీసుకుంటు

న్నారు. వాళ్ళు పుట్టినప్పట్నించే వాళ్ళను డాక్టర్లను చెయ్యాలనో ఇంజనీర్లను చెయ్యాలనో వాళ్ళ తల్లిదండ్రులు కలలుకంటున్నారు. పిల్లలకా చదువు యిష్టంలేకపోయినా, ఆచదువు చదవటానికి కావలసిన తెలివితేటలు లేకపోయినా వాళ్ళను బలవంతంగా సైన్స్ గ్రూపులోనో, లెక్కల గ్రూపులోనో చేర్పిస్తున్నారు. వాళ్ళకు ట్యూషన్లు చెప్పించి, యే నెల్లూరుకో, గుంటూరుకో కోచింగ్‌కని పంపించి, వాళ్ళచేత గంటగ్గంటలు బండచాకిరి చేయిస్తున్నారు. ఇంత చేస్తే వాళ్ళల్లో చాలామంది ఇంటర్‌లోనే ఫెయిలవుతున్నారు. ఇంటర్‌లోంచి బయటపడ్డవాళ్ళు ఎంట్రెన్స్‌లో పోతున్నారు. చదువుకోవటం అనేది ఇంత యాతన కాకూడదు... చదువు మనసును రజింపచేసేదిగా వుండాలి.... ఆశ్చర్యమేమిటంటే తమ పిల్లలకు తక్కువ మార్కులొచ్చాయంటే అది వాళ్ళ లోపమేనని యే పేరెంట్ కూడా అంగీకరించడు. లెక్చరర్లు సరిగ్గా చెప్పలేదు. పేపర్లు దిద్దినవాళ్ళు సరిగ్గా దిద్దలేదు. పరీక్షల ముందే ఘావాడికి జ్వరమొచ్చింది. బాగా డబ్బున్నవాళ్ళకు ఎంసెట్ పరీక్షాపత్రం ముందే తెలిసిపోతుంది. సీట్లు వాళ్ళకే వస్తాయి. ఇలా ఎన్నో కారణాలను సృష్టిస్తారు. ఇట్లా ఈనాటి పిల్లల్ని వాళ్ళ తల్లిదండ్రులే తప్పు మార్గంలో పెడ్తున్నారనిపిస్తుంది. వాళ్ళల్లో సహజంగావున్న తెలివితేటల్ని వికసించనీయకుండా చేసేస్తున్నారు. చాలా చిన్నవయస్సులోనే వాళ్ళచేత వయస్సుకు మించిన హోమ్‌వర్కులను చేయిస్తున్నారు.... మూడు నాల్గు యేళ్ళు కూడా లేని పసిపిల్లలచేత బండెడు పుస్తకాల్ని మోయిస్తున్నారు.... ఒకసారి పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఆర్.కె. నారాయణ్ ఈదేశపు పసిపిల్లల్ని బరువులుమోసే జంతువులుగా మార్చేస్తున్నారని వాపోయాడు." అన్నాను.

"అన్నింటికంటె బాధ కల్గించే విషయమేమిటంటే వీళ్ళంతా డాక్టర్లం కావాలనుకోవటానికి కారణం డాక్టర్ వృత్తిపట్ల వున్న గౌరవం వల్ల కాదు. ఆఫీల్డ్‌లో రిసర్చ్‌చేసి కొత్తమందులను కనుక్కొని మానవజాతిని సుఖంగా బ్రతికేలా చేద్దామనీకాదు. వీళ్ళందరికీ ఒకే ఒక గుడ్డినమ్మకమేమిటంటే డాక్టరయితే లక్షలకు లక్షలు డబ్బు సంపాదించవచ్చునని. యే స్టేట్స్‌కో యే గల్ఫ్‌కంట్రీకో వెళ్ళి కోట్లు సంపాదించవచ్చునని. మా ఆవిడేమంటుందంటె పెద్దదానిలా చిన్నదానికి మెడిసిన్‌లో సీటురాకపోతే ఐదులక్షలు డొనేషన్ కట్టి యే ప్రైవేట్ మెడికల్



కాలేజీలోనన్నా చేర్పించాలట. మన దగ్గర ఐదు లక్షలెక్కడున్నాయంటే అప్పుతెమ్మంటుంది. ఇదీ పరిస్థితి. రేపు మా చిన్నదానికి మామూలుగా ఇక్కడ మెడిసిన్‌లో సీటు రాకపోతే నన్ను నేను అమ్ముకొనైనాసరె ఐదు లక్షలు సంపాదించి యే కర్ణాటకకో పరిగెత్తాలి. లేకపోతే మా ఆవిడ నన్ను యింట్లో ఉండనివ్వదు" అన్నాడు రాజశేఖర్.

మేమిలా మాట్లాడుకుంటుండగానే వాళ్ళావిడ "అమ్మాయికి జ్వరమెక్కువయిపోయిందండి. అన్నీ పరాకులు మాటలు మాట్లాడుతోంది" అంటూ వచ్చేసింది. నన్ను చూసి కొంచెం ఆశ్చర్యపడి "మీరెప్పుడొచ్చారన్నయ్యగారూ" అంది.

"ఇప్పుడే వచ్చానమ్మా" అన్నాను.

"ఎంత న్యాయమో చూశారా అన్నయ్యా. సంవత్సరమంతా రాత్రింబవళ్ళు చదివి చదివి ఇప్పుడు పరీక్ష రాయలేనంటోందమ్మాయి. మా పక్కింటి వాళ్ళమ్మాయిని చూడండి. ఆ అమ్మాయికి యే ఎగ్జామినేషన్ ఫోబియా లేదు. పుస్తకాలు, నోట్సులూ అన్నీ దీని దగ్గర్నుంచే తీసుకుంది. ఆ అమ్మాయేమో రేపు చక్కగా ఎగ్జామ్ రాస్తుంది. మనమ్మాయేమో పరీక్షలభయంతో వణికి చస్తుంది. ఎంతఅవమానం... ఎంత అప్రతిష్ట" అందామె అంతలోనే ఆమెకళ్ళల్లోకి కన్నీళ్ళొచ్చేశాయి.

"పరీక్ష సమయానికి జ్వరమొస్తే ఎవరు మాత్రం యేంచేస్తారు. ఇందులో అవమానమేముంది. అప్రతిష్టేముంది." అంటూ డాక్టర్ రాజశేఖర్ "అమ్మాయిని చూద్దువుగాని లోపలకురా" అన్నాడు.

అందరమూ వాళ్ళ చిన్నమ్మాయి మాధవి పడుకున్న గదిలోకెళ్ళాం.

ఇదివరకు చూసినప్పటికీ ఇప్పటికి మాధవి బాగా చిక్కిపోయింది. నన్ను చూడగానే "నమస్తే అంకుల్! జ్వరమొచ్చిందంటే నాకు పరీక్షరాయటానికి మరో అవకాశం యివ్వరా అంకుల్" అంది మాధవి.

"అలా ఇవ్వరమ్మా! జ్వరమొచ్చినవాళ్ళందరికోసం మరోసారి పరీక్ష పెట్టరు. అయినా ఇప్పుడేమయ్యింది. రేపటి వరకు నీ జ్వరం తగ్గిపోతుందిగా" అన్నాను.

"జ్వరం తగ్గినా నేను పరీక్షలెలా రాయగలను అంకుల్"

"ఎందుకు రాయలేవమ్మా?"

"నిన్నట్నించి యేమీ చదువలేదు"

"నిన్నట్నించి చదవకపోతే యేం? సంవత్సరమంతా చదివావుగా. ట్యూషన్ చెప్పించుకున్నావు. బోల్డు హోమ వర్క్ చెశావు."

"ఎంత చేస్తే యేం లాభం అంకుల్? నా బుర్రలో ఇప్పుడేమీలేదు. అంతా మరచిపోయాను. ఇప్పుడు పరీక్ష హాల్లోకెడ్తే ఒక్క అక్షరం కూడా రాయలేను."

"ఇపుడిలాగే అనిపిస్తుంది. క్వశ్చన్ పేపర్ చూడగానే నీకన్నీ గుర్తొస్తాయి. నా మాటవిని రేపు పరీక్షకు వెళ్ళు" అన్నాను.

"అమ్మో! పరీక్షహాలంటేనే నాగుండె ఆగిపోతుందంకుల్" అంటూనే ఆ అమ్మాయి విపరీతంగా వణికిపోసాగింది.

రాజశేఖర్ టెంపరేచర్ ఎంతుందో చూశాడు

"టెంపరేచర్ పెద్దగా యేమీ లేదు. ఇది భయంతో ఇలా చేస్తోంది. రేపు నువ్వు పరీక్షలకు వెళ్ళకపోతే మానె. టెన్షన్‌తో నువ్వు చచ్చిపోతున్నావు. మమ్మల్ని చంపుతున్నావు... ఎగ్జామ్‌లేదు గిగ్జామ్‌లేదు....ఫ్రీగా, రిలాక్స్‌డ్‌గా వుండు. ఈ టాబ్లెట్స్ వేసుకో" అంటూ ఆ మ్మాయికో టాబ్లెట్ యిచ్చాడు రాజశేఖర్. మాధవి ఆటాబ్లెట్ వేసుకొని కళ్ళుమూసుకొని పడుకొంది.

అందరం బయటి గదిలోకొచ్చాం.

"ఎగ్జామ్‌లేదు గిగ్జామ్‌లేదు అని మీరే అన్నాక అదిక ఎగ్జామ్ రాయదు..... పాడు రాయదు... సంవత్సరమంతా కష్టపడి రేపు దాన్ని పరీక్షకు పంపించకపోతే మన పరువేమన్నా వుంటుందా చెప్పండి.... మీరేమన్నా చెయ్యండి.... యే మందులన్నా యివ్వండి.... ఎల్లుండి మాత్రం దాన్ని పరీక్షకు పంపించాలి." అంది మిసెస్. రాజశేఖర్ పట్టుదలగా.

"దాన్ని మరీ బలవంతం చేస్తే టెన్షన్‌తో చచ్చూరుకుంటుంది. అప్పుడు దాన్నికాదు....దాని శవాన్ని పరీక్షకు పంపించాల్సి వస్తుంది. అది డాక్టర్ కావటం దానికోసంకాదు... నీకోసం....నీ పరువు ప్రతిష్టలకోసం దాన్నెలాగైనా డాక్టర్ని చెయ్యాలి. వేరే సమస్యలు నీకేమీ అక్కర్లేదు" మందలించినట్టుగా అన్నాడు డాక్టర్ రాజశేఖర్.

"కూల్ డౌన్ డాక్టర్... కూల్ డౌన్! రేపటి వరకు అమ్మాయి పరిస్థితి మెరుగౌతుందిలెండి. రేపు మళ్ళీ వస్తాను" అంటూ వాళ్ళతో సెలవు తీసుకొని బయటకొచ్చాను. ★